క్లుప్తంగా

'పార్టీ బలోపేతమే లక్ష్యం'

మరికల్: పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేస్తున్న పాదయాత్రను స్ఫూర్తిగా తీసుకొని మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వీరన్న అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, మాయ మాటలు చెప్పి పాలన సాగిస్తున్నరన్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నాయకులు కృష్ణయ్య, రామకృష్ణ, హరీష్‌లు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ వైర్లు చోరీ : పోలీసులకు ఫిర్యాదు

నర్వ: మండలంలోని ప్రధాన సాగునీటి భూత్పూరు కెనాల్ నీటికోసం వేసుకున్న మోటార్ల వైర్ల కొందరు చోరీ చేస్తున్నారని రైతులు వాపోయారు. ఘటనపై నర్వ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. శనివారం రాత్రి దాదాపు పదిహేను మంది రైతులకు సంబంధించిన సర్వీస్ వైర్లను చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతులు గోవర్ధన్, ఆకుల వెంకటయ్య, కతలప్ప, కిష్టప్ప, రాములుగౌడ్, ఉమరప్ప, యాదయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధికి కృషి చేయాలి



నారాయణపేట టౌన్ : తొగట వీర క్షత్రీయులు ఐక్యంగా అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చింత శంకర్ అన్నారు. స్థానిక బ్రాహ్మణ్‌వాడి చౌడేశ్వరి మాత మందిరంలో సంఘం జిల్లా నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు ఐక్యంగా అభివృద్ధి చేపట్టేందుకు ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ ఐక్యతకు కృషిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. అప్పుడే హక్కులు సాధించుకోగలమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మురళీ మోహన్, కోశాధికారి మంచాల బాలరాజ్, ఉపాధ్యక్షుడు జల్లు వెంకటస్వామి, సురేష్, మహాదేవ్, లక్ష్మీనారాయణ, బాలయ్య, రమేష్, రాకేష్, శ్రీనివాస్, అశోక్, నర్సింములు, రమేష్, లక్ష్మీనారాయణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

మహమ్మదాబాద్ దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చిన్నాయిపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భక్తిభావం వెల్లివిరుస్తుందని, దైవచింతనతో సత్ప్రవర్తన అలవడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. అప్పుడే మోక్షం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ మధులత, రాణి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ప్రారంభం



నవాబుపేట: మండలంలోని పోమాల్ సమీపంలోని హజ్రత్ మాలిక్‌షా దర్గా ఉర్సు ఆదివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న గంధోత్సవం, ఖవాలి వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకుడు మునిరుద్దీన్ ఖాద్రీ తెలిపారు. మండల కేంద్రంలోని మునీరుద్దీన్ ఇంటి నుంచి గంధోత్సవ ఊరేగింపు నిర్వహించారు. మత సామరస్యాలకు ప్రతీకగా ఈ ఉర్సులో అందరూ పాల్గొని కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. పోమాల్, కామారం తదితర గ్రామాల ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్లలో ఆదివారం నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే టోర్నీలో ఆర్‌కే స్పోర్ట్స్ కరాటే దూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మాస్టర్ కె.రవికుమార్ తెలిపారు. సీనియర్ బ్లాక్‌బెల్టు కటాస్ విభాగంలో జయదీప్‌సింగ్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు తెలిపారు. ఆయా విభాగాల్లో – 37కేజీలో దిపేష్, – 27కేజీలో దీక్షిత్, –20 కేజీలో రితిక్, – 30కేజీలో అఖిలేష్ బంగారు పతకాలు, సబ్ జూనియర్ విభాగంలో అగస్త్య బంగారు పతకం, దినేష్, రోహిత్, అభినవ్ రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. వీరిని కరాటే మాస్టర్లు అభినందించారు. అదేవిధంగా సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఏప్రిల్ 3 వరకు అమలు

మక్తల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పరీక్షలు సమీపిస్తుండడంతో పదోతరగతి విద్యార్థులకు అదనపు తరగతులు, ప్రత్యేక తరగతులు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే క్రమంలో ఉదయం ఏమీ తినకుండా పాఠశాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో వారు పస్తులుండి మధ్యాహ్న భోజన సమయం వరకు పాఠాలు వినే పరిస్థితి తలెత్తకుండా అల్పాహారం అందిస్తున్నారు. దాదాపు 34 రోజుల పాటు అల్పాహారం అందిస్తారు. ఇప్పటికే ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏప్రిల్ 3 వరకు కొనసాగనుంది. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలోని 11 మండలా ల్లో 77 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 4857 మంది విద్యార్థులు పదోతరగతి చదవుతున్నారు. వీరంతా వందశాతం ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ పత్ర్యేక తరగతులు నిర్వహింప జేస్తోంది. ఈ నేపథ్యంలోనే విద్యార్థులకు అల్పాహారం అందివ్వాలని నిర్ణయించారు. అందుకోసం జిల్లాకు దాదాపు రూ. 27లక్షలు మంజూరు చేశారు. నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున ఖర్చు చేసి నిత్యం అల్పాహారం అందిస్తున్నారు.



మక్తల్‌లో అల్పాహారం అందుకుంటున్న విద్యార్థులు



తరగతులకు హాజరైన విద్యార్థులు

ప్రయోజనకరంగా ఉంది

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తరఫున అల్పాహారం అందివ్వడం చాలా ప్రయోజనకరంగా ఉంది. మాలో చాలా మంది తరగతులకు వచ్చే సమయంలో పస్తులుండాల్సిన సమస్య తీరింది. అల్పాహారం అందివ్వకపోతే మధ్యాహ్న భోజనం వరకు పస్తులుండి పాఠాలు వినాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు సమస్య లేదు. దీంతో ప్రత్యేక తరగతులపై పూర్తి శ్రద్ధ పెట్టగలుగుతున్నాం.

–నవీన్, 10వ తరగతి, మక్తల్

విద్యార్థులకు ఉపయోగకరం

అల్పాహారం కార్యక్రమం పదో తరగతి విద్యార్థులకు ఎంతోమేలు చేస్తుంది. వారు పస్తులుండి పాఠాలు వినాల్సిన సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎప్రిల్ 3 వరకు కార్యక్రమం కొనసాగుతుంది. అదనపు తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆకలి బాధ లేకుండా చర్యలు చేపట్టాం. నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నాం.

–లియాకత్ అలీ, డీఈఓ, నారాయణపేట

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మాగనూర్: గ్రామాలలో అంతర్గత రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రభుత్వం కనికరం చూపించిందని వడ్వాట్ సర్పంచ్ నర్సిములు అన్నారు. గ్రామంలోని 1,2,6,7,10 వార్డులలో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మంజూరైన రూ. 20 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పారిశుద్ధ్యం సమస్య కూడా తొలగిపోతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ నర్సిములు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



మక్తల్‌లో బందోబస్తు చేపట్టిన పోలీసులు



మద్దూర్‌లో పోలింగ్ కేంద్రానికి చేరిన సిబ్బంది

మక్తల్: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మక్తల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్ వద్ద సీఐ సీతయ్య, ఎస్ఐ పర్వతాలు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. సోమవారం నిర్వహించే ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది బూత్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ తిరుపతయ్య తెలిపారు.

మద్దూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రవి తెలిపారు. ఆదివారం పోలింగ్ సిబ్బందితో పాటు బ్యాలెట్ బాక్సులు, తదితర సామగ్రి పోలింగ్ కేంద్రానికి చేరాయన్నారు. పోలింగ్ కేంద్రంలో పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ సతీష్ తెలిపారు. కాగా ఇక్కడ మొత్తం 43 ఓట్లు ఉన్నాయి.

బీఆర్ఎస్‌లో చేరికలు

భూత్పూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని భట్టుపల్లికి చెందిన మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షుడు గంగాధర్, 20 మంది బీజేపీ పార్టీకి చెందిన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుడికి నివాళి

గండేడ్: కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంలో పంచాయతీ కార్మికుడు కొంగబాబు మృతి విషాదకరమని డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు రాకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు.కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, మల్కయ్య, చిన్న హన్మయ్య, సుదర్శన్, నర్సమ్మ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకే మొదటి ప్రాధాన్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాల్లో మొదటి ప్రాధాన్యం మహిళలకే ఇస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సతీమణి శారద అన్నారు. జిల్లా కేంద్రం మోనప్పగుట్టలోని మోనేశ్వరస్వామి దేవాలయ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శారద మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఇళ్లను మహిళల పేరిట ఇస్తున్నారని, ఇటీవల ప్రవేశపెట్టిన సొంత ఇంటి నిర్మాణ పథకానికి కూడా గృహలక్ష్మీ పేరు పెట్టినట్లు తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో ముందున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, రుణాల సాయంతో సొంతకాళ్లపై నిలబడి ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, కోఆప్షన్ సభ్యురాలు జ్యోతి, మహిళా మండలి సభ్యులు తాటి లక్ష్మి, సుజాత, రమాదేవి, యాదమ్మ, స్వప్న, మాలతి, సరోజ, సహేరా, విమల, వసంత, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సమితి బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా సభ్యులు వంశీలత మాట్లాడుతూ మహిళలు స్వయం కృషితో ఉన్నత శిఖరాలు చేరుకుంటున్నారని, మగవాళ్లకు ధీటుగా మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మహిళలు అంతరిక్షంలో కూడా తమ సత్తా చాటుకుంటున్నారని, తల్లిదండ్రులు కూడా బాలికలను విద్యలో ప్రోత్సహించి వారిని స్వశక్తితో ఎదిగి జీవితంలో స్థిరపడేలా తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం మహిళలకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉదయశ్రీ, ప్రధాన కార్యదర్శి పద్మజా రెడ్డి, ఉపాధ్యక్షురాలు శశికళ, వరలక్ష్మి, నర్మద, శ్రీదేవి, వనజ, వినోద, కవిత, హేమలత, స్వరూప, మాధవి, సుమతి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం : కేసు నమోదు

మరికల్: మండల కేంద్రానికి చెందిన ఓ యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు ఆదివారం కేసునమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మరికల్‌లోని ఓ వాడకు చెందిన యువతి ఈనెల 9న గుడికి వెళ్లివస్తానని ఇంటి నుంచి వెళ్లింది. ఎంత సేపటికీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కలా, బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో ఓ వ్యక్తి కూడా కన్పించకుండా పోవడంతో, తమ కుమార్తె కనిపించక పోవడానికి అతడే కారణమని భావించిన ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని యువతి ఆచూకీ కోసం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చామని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

కల్వర్టు నిర్మించాలని నిరసన



ధన్వాడ: మండలంలోని మందిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగుపై కల్వర్టు నిర్మించాలని సీపీఐ జిల్లా నాయకులు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆరేళ్ల క్రితం కల్వర్టు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా నేటికి పనులు ప్రారంభించలేదని అన్నారు. వెంటనే నిర్మించాలని కోరారు.

నిజాయితీ చాటుకున్న దోబీ

కోస్గి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఓ పేద కుటుంబానికి చెందిన దోబీ బట్టలు ఐరన్ చేస్తున్న క్రమంలో తనకు దొరికిన డబ్బులను సంబంధిత యజమానికి ఫోన్ చేసి అందజేయడం ద్వారా నిజాయితీని చాటుకున్నాడు. పట్టణంలోని అట్కర్ వీధికి చెందిన చాకలి బస్వరాజ్ తెలుగువీధిలో ఇస్త్రీ దుకాణం నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకున్నాడు. ఈ క్రమంలో టీచర్స్ కాలనీకి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్‌రెడ్డికి చెందిన దుస్తులు ఆదివారం ఇస్త్రీ కోసం పంపించారు. బట్టలు ఇస్త్రీ చేస్తున్న క్రమంలో ప్యాంటు జేబులో రూ. 6900 ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే రఘునాథ్‌రెడ్డికి ఫోన్ చేసి డబ్బులు ఉన్న విషయం చెప్పి, దొరికిన నగదు అందజేయడంతో యజమాని బస్వరాజ్ నిజాయితీకి ధన్యవాదాలు తెలిపారు. కాలనీవాసులు ఆయనను అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మక్తల్: పట్టణంలోని భారతీ విద్యానికేతన్‌లో ఆదివారం మక్తల్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం(1978) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు ఆనాటి రోజులను గుర్తుచేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం రాఘువేందర్‌రావు, ఆంజనేయులుగౌడ్, భీంరెడ్డి, క్రిష్ణమూర్తి, లక్ష్మికాంత్‌రెడ్డి, గోపాల్, రమాకాంత్, గురురాజ రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రచారం



మద్దూరు: మండలంలోని నాగంపల్లి, నాగిరెడ్డిపల్లి, దమ్‌గాన్‌పూర్, పర్సపూర్, చింతల్‌ధిన్నే గ్రామాల్లో టీడీపీ ఇంటింటి ప్రచారం చేపట్టింది. నియోజకవర్గంలో గతంలో టీడీపీ బలంగా ఉండేదని పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కోసం ఈ ప్రచారం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ వెంకటప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవి, రవీందర్‌రెడ్డి, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం

ఆత్మకూర్: ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారు అక్కడ ప్రపంచ శాంతికోసం ప్రార్థించాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు ఉమ్రా యాత్రకు వెళ్తున్న సందర్భంగా పట్టణంలో వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.



బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి



మక్తల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మక్తల్: ఎమ్మెల్సీ కవిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకుడు బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఆదివారం రాస్తారోకో నిర్వహించిన అనంతరం మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కోస్గి: ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. శివాజీ చౌరస్తాలో పాలమూర్–తాండూర్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకట్‌నర్సిములు, నాయకులు ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్, ఉసేనప్ప, అహ్మద్ పాషా, రాజశేఖర్ రెడ్డితో గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మద్దూరు: బండి సంజయ్ వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం మద్దూరు, కొత్తపల్లి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశాయి. కవితకు బహిరంగ క్షమాణపలు చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, రైతు సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు మహేందర్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, మీరాన్, నరేందర్‌రెడ్డి, రఘు, తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో నిరసన చేపట్టిన నాయకులు



కొత్తపల్లిలో ధర్నా చేస్తున్న నాయకులు

నిత్యావసర సరుకులు అందించాలి

నారాయణపేట టౌన్ : నిరుపేద ప్రజలకు రేషన్‌షాపుల్లో బియ్యంతో పాటు 14 రకాల నిత్యవసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.కాశీనాథ్ అన్నారు. ఈ మేరకు పీవైఎల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నామన్నారు. పీవైఎల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 17 వేల రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేసి పేదలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఇక నుంచి సన్న బియ్యం ఇవ్వాలని, అదేవిధంగా వంట నూనె, పెసర, గోధుమపిండి, పంచదార, టీ పొడి, ఉప్పు, కారం, పసుపు, చింతపండు. పల్లీలు, సబ్బులు, వంట గ్యాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు నుంచి, సబ్సీడీ కూడా ఎత్తివేశారని విమర్శించారు. తక్షణమే అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యక్షులు సిద్దు, సహాయ కార్యదర్శి సలీం, సభ్యులు, పాల్గొన్నారు.

'ఆధార్' కష్టాలకు చెక్

మాగనూర్: మండల ప్రజలకు ఆధార్ కష్టాలు తప్పాయి. ఇదివరకు ఆధార్ కార్డులో సవరణలు, నూతన కార్డ్ తీసుకోవడం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో రాకపోకలకు సమస్యలు ఎదురుకావడంతో పాటు అవసరమైనప్పుడు సమయానికి అందక ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యే వారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆయా గ్రామాల ప్రజలు ఎన్నోసార్లు విన్నవించారు. ఫలితంగా ప్రస్తుతం ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆధార్‌కార్డుతో ఫోన్ నంబర్ లింక్ ఉండటంతో ఓటీపీ వస్తేనే రేషన్ బియ్యం ఇస్తుండటంతో ఇదివరకు చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. సవరణలు చేయించుకోవడానికి అందుబాటులో కేంద్రం లేకపోవడంతో చాలామంది. రేషన్ బియ్యం తీసుకోలేకపోయేవారు. దీంతో మక్తల్, కృష్ణ, నారాయణపేట, మహబూబ్‌నగర్ లాంటి ప్రాంతాలకు వెళ్లి సవరణలు చేయించుకునేవారు. ప్రస్తుతం మాగనూర్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు కావడంతో 18 గ్రామాల ప్రజలకు సమస్యలు తప్పనున్నాయి. దీంతో ఇక ఆధార్‌లో సవరణలు, నూతన కార్డుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పిందని ప్రజలు అంటున్నారు.



నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రం(ఫైల్)

ఇబ్బందులు తొలిగాయి



గతంలో మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో ప్రయాణ సంబంధ సమస్యలతో పాటు సమయం వృథా అయ్యేది. పని త్వరగా పూర్తికాకపోతే మరోసారి వెళ్లాల్సి వచ్చేది. దీంతో డబ్బులు వృథా అయ్యేవి. ప్రస్తుతం మండల కేంద్రలోనే ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.

– రాఘవేంద్ర, మాగనూర్

వినియోగించుకోవాలి



గతంలో స్థానికంగా ఆధార్ కేంద్రం లేక ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు. ప్రస్తుతం మాగనూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేశాం. దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఆధార్‌లో సవరణలు, కొత్త కార్డులు కోసం ఆధార్ కేంద్రంలో సంప్రదించవచ్చు.

– అమీర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్, మాగనూర్

కమిటీ ఎన్నిక

ఊట్కూరు: గ్రామంలోని భవానీ మందిర్‌లో ఆదివారం ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడిగా చోద్రి అశోక్‌ను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అదేవిధంగా ఆయనతో పాటు ఉపాధ్యక్షులుగా డా సుభాష్, ప్రధాన కార్యదర్శిగా తుల్జారాం, సహాయకార్యదర్శిగా భీంరావు, కోశాధికారిగా గోవింద్‌రావు, సభ్యులుగా వినాయక్‌రావు, జగన్నాథ్‌రావు, భాస్కర్‌రావు ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు.